

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.1,66,043

– భువనేశ్వర్/పూరీ



జంట నగరాల్లో విద్యుత్ బస్సు సేవలు

క్యాపిటల్ రీజియన్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ (క్రట్) ఆధ్వర్యంలో 100 విద్యుత్ బస్సులను శనివారం ప్రారంభించారు.

- 8లో



ఒడిశా, పశ్చిమ బెంగాల్ బంధాలు బలమైనవి

- 8లో

తరతరాలుగా ఒడిశా మరియు పశ్చిమ బెంగాల్ బంధాలు అత్యంత బలమైనవని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు.

న్యూస్‌రీల్

ఫ్యామిలీ కోర్టు ప్రారంభం



జడ్జి నిషిత్ నిశాంక్‌కు స్వాగతం పలుకుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కొరాపుట్: జిల్లాలోని కోట్‌పాడ్ పట్టణంలో ఫ్యామిలీ కోర్టు సేవలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. జయపూర్ కుటుంబ న్యాయస్థానం జడ్జి నిషిత్ నిశాంక్ కోట్‌పాడ్ కోర్టులో సర్క్యూట్ ఫ్యామిలీ కోర్టు సేవలు ప్రారంభించారు. ప్రతీ నెలకు రెండుసార్లు కేసులు విచారించనున్నారు. దీంతో ఇకపై కోట్‌పాడ్ ప్రాంతానికి చెందిన కక్షిదారులు జయపూర్ వెళ్లాల్సిన అవసరం ఉండదు. కోర్టుకి వచ్చిన జడ్జిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మణి పట్నాయక్, మాజీ అధ్యక్షుడు పంకజ్ పాత్రో స్వాగతం పలికారు.

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్



గాంధీ జంక్షన్ వద్ద పనిచేయని ట్రిఫిక్ సిగ్నల్ లైట్లు

జయపురం: సబ్ డివిజన్ కోట్‌పాడ్‌లో గత మూడేళ్లుగా ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడేళ్ల క్రితం పురపాలక సంస్థ కోట్‌పాడ్ గాంధీ జంక్షన్ వద్ద, బిజూ పట్నాయిక్ జంక్షన్ వద్ద సిగ్నల్ పాయింట్లు ఏర్పాటు చేసింది. అయితే ఆ రెండు ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు అప్పటినుంచి పనిచేయడం లేదని వెల్లడించారు. అవి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని వాపోతున్నారు. ఈ రెండు ట్రాఫిక్ సిగ్నల్ లైట్లను బాగు చేయాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వీటిని మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు



సీట్ల కోసం లాటరీ తీస్తున్న దృశ్యం

కొరాపుట్: జయపూర్‌లో నూతనంగా ప్రారంభించనున్న కేంద్రీయ విద్యాయలంలో లాటరీ ద్వారా సీట్ల కేటాయింపు జరిగింది. శనివారం బాయ్స్ హైస్కూల్ సమీపంలోని విద్యాలయం ఆవరణలో జయపూర్ సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి పర్యవేక్షణలో లాటరీ తీశారు. జూలై నుంచి ఇక్కడ తరగతులు ప్రారంభమవ్వనున్నాయి. ఒకటి నుండి 5 తరగతులకు 1,009 మంది అప్లికేషన్లు ఇచ్చారు. ఒక్కొక్క తరగతికి 40 సీట్లు ఉన్నాయి. దీంతో సీట్ల కేటాయింపులో అవకతవకలు చోటుచేసుకోకూడదని అందరి ముందు లాటరీ తీశారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ హరిహర పండా, కొరాపుట్ కేవీ ప్రిన్సిపాల్ సరోజ్ కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగుల సెలవులు రద్దు

భువనేశ్వర్: సువర్ణ రేఖ నది ఉప్పొంగడంతో వరద పరిస్థితి నెలకొని ఉంది. ఉధృతి క్రమంగా పుంజుకుంటున్న తరుణంలో విపత్కర పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తుగా అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో బాలాసోర్ జిల్లా యంత్రాంగం తక్షణమే ప్రభుత్వ ఉద్యోగుల సెలవులను రద్దు చేసింది. సెలవులో ఉన్న ఉద్యోగులు వెంటనే విధులకు హాజరు కావాలని కలెక్టర్ సూర్యవంశీ మయూర్ వికాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు ముందస్తు అనుమతి లేకుండా తమ ప్రధాన కార్యాలయాన్ని వదిలి వెళ్లరాదని ఆదేశించారు. బాలాసోర్ జిల్లా జలేశ్వర్ మండలం రాజ్‌ఘాట్ సమీపంలో సువర్ణ రేఖ నది ప్రమాద సంకేతం దాటి ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా అనేక లోతట్టు గ్రామాల్లో వరద పరిస్థితులు తాండవిస్తున్నాయి. ప్రభావిత ప్రాంతాల్లో భొగరాయ్ మరియు బలియాపాల్ మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో వరద నీరు ఖొల్లాబాడియా, కుల్హా, బౌంసఖానా, కుదమాన్‌సింగ్, చౌదరి కుద్, బలియాపాల్ వంటి గ్రామాలను ముంచెత్తింది. కొన్ని రోడ్లపై నాలుగు అడుగుల ఎత్తు వరకు వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జల దిగ్బంధంలో చిక్కుకున్న ప్రాంతాలు ఒంటరిగా బిక్కుబిక్కుమంటున్నాయి. భోగరై, జలేశ్వర్, బలియాపాల్ మండలాల్లోని పలు పంచాయతీలు వరద ఉన్నాయి.

ఆసనోత్సాహం..!



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో కుమార్తెతో కలిసి యోగాసనం వేస్తున్న బీజేపీ నాయకుడు మృత్యుంజయ్ దాస్



పూరీ సాగర తీరంలో పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ సైకత శిల్పం

రాష్ట్ర వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వైభవంగా శనివారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో, మైదానాల్లో యోగా శిబిరాల్లో భాగంగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. యోగాతో మానసిక, శారీరక ఉల్లాసం లభిస్తుందని తెలియజేశారు. యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని పేర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భువనేశ్వర్: యోగా వేడుకల్లో సాంస్కృతిక నృత్య ప్రదర్శన



భువనేశ్వర్: యోగాసనం శిబిరంలో గవర్నర్ దంపతులు



భువనేశ్వర్: ఆసనాలు వేస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ తదితరులు

• ప్రపంచానికి భారత్ ఇచ్చిన బహుమతి యోగా



మాట్లాడుతున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన గొప్ప బహుమతి యోగా అని సీఎం మోహన్‌చరణ్ మాఝీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక కళింగ స్టేడియంలో రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ రాష్ట్రస్థాయి యోగా వేడుకలు శనివారం నిర్వహించింది. ఈ సందర్భంగా యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయామం లేదా ఆసనాలకు పరిమితం కాదన్నారు. యోగా శారీరక, మేధో, మానసిక మరియు ఆధ్యాత్మికం యొక్క ప్రత్యేకమైన సంగమమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి మరియు సాంప్రదాయాల్లో యోగా అంతర్భాగని తెలిపారు. పాఠశాల కార్యక్రమాలు మరియు ప్రజారోగ్య కార్యక్రమాల్లో యోగాను చేర్చడానికి ప్రభుత్వం యోచిస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ ప్రభుత్వ అధికారులు సహా దాదాపు 15,000 మంది పాల్గొన్నారు.



భువనేశ్వర్: ఖుర్దారోడ్ రైల్వే స్టేడియంలో...



జయపురం: కేసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో...



జయపురం: విక్రమదేవ్ వర్సిటీలో యోగా సాధన




జయపురం: యోగా చేస్తున్న ఎన్‌సీసీ క్యాడర్




కొరాపుట్: యోగా చేస్తున్న జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో యోగా చేస్తున్న కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో



కొరాపుట్: ఆసనాలు వేస్తున్న మంత్రి నిత్యానంద గోండో



మల్కన్‌గిరి: యోగాలో పాల్గొన్న బీఎస్‌ఎఫ్ డీఐజీ విజయ్ సిన్హా



పర్లాకిమిడి: యోగాసనాలు వేస్తున్న అధికారులు, నాయకులు



భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే జోనల్ స్థాయి యోగా శిబిరం



పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీలో...



కొరాపుట్: ఆసనాలు వేస్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్హి, కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపుధర్ బోత్ర



జయపురం: జిల్లా కోర్టు ప్రాంగణంలో...

రథయాత్ర నిర్వహణపై సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

మల్కన్‌గిరి: ఈనెల 27వ తేదీ నుంచి జూలై 5 వరకు చేపట్టనున్న రథయాత్ర నిర్వహణపై స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా పోలీసులు రథ చక్రాల స్థితి పరిశీలన చేయాలన్నారు. వాహనాల నియంత్రణ, శాంతి భద్రతల నిర్వహణ బాధ్యతను వారికి అప్పగించారు. రథం లాగే సమయంలో అందుబాటులో అంబులెన్స్‌తో పాటు వైద్యుడు ఉండాలని స్పష్టం చేశారు. అలాగే అగ్నిమాపక సిబ్బంది సైతం అందుబాటులో ఉండాలని సూచించారు. పట్టణంలోని ముఖ్యమైన చోట్ల నీటి ట్యాంకులు అందుబాటులో ఉంచాలని పీహెచ్‌డీ విభాగ సహాయక ఇంజినీర్‌కు ఆదేశించారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులను స్వచ్ఛందంగా సేవల కోసం నియమించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ వినోద్ పటేల్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్ర శొబరో, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, తహసీల్దార్ టికును పుటా, ఐఐసీ రీగాన్‌కీండో, డీఐపీఆర్వో ప్రమిళా మాఝి తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ ఓఏఎస్‌ల క్షేత్రస్థాయి పర్యటనలు



ధ్రువపత్రాలు అందుకుంటున్న ట్రైనీ ఓఏఎస్‌లు



కాఫీ రైతులతో మాట్లాడుతున్న ట్రైనీలు

కొరాపుట్: శిక్షణలో ఉన్న ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. శనివారం కొరాపుట్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలను సందర్శించారు. త్వరలో పరిపాలనా పగ్గాలు చేపట్టనున్న ఈ యువ అధికారులు గ్రామాల్లో అమలవుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం కొరాపుట్ కాఫీ బోర్డు సమీక్షా సమావేశం నిర్వహించారు. నందపూర్, కొరాపుట్, బొయిపరిగుడ, జయపూర్ సమితుల్లో కాఫీ పంటలు పండిస్తున్న రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. వీరికి జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మలు ధ్రువపత్రాలు అందజేశారు.

అతిసార పరిస్థితి అదుపులో ఉంది

• సీఎం మోహన్‌చరణ్ మాఝీ

భువనేశ్వర్: రాష్ట్రంలో 6 జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో అతిసార పరిస్థితి, వివిధ నియంత్రణ చర్యలను ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శనివారం స్థానిక లోక్‌సేవా భవన్‌లో సమీక్షించారు. రాష్ట్రంలో పరిస్థితి ఇప్పుడు అదుపులో ఉందన్నారు. కొత్త సంక్రమితుల సంఖ్య పూర్తిగా తగ్గిందని పేర్కొన్నారు. జాజ్‌పూర్, భద్రక్, కటక్, కేంద్రాపడా, ఢెంకనాల్ మరియు కెంజొహర్ జిల్లాల్లో అతిసార సంక్రమణ సంఖ్య తగ్గి జనజీవనం సాధారణ స్థితికి చేరుకుంటుందని వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 3,892 మంది వ్యాధి బారినపడిగా, 3,543 మంది కోలుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలోని వివిధ శాఖల సమన్వయ ప్రయత్నాల కారణంగా అతిసార పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు.

అందుబాటులో ఉంచాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వైద్య కళాశాలల వరకు వైద్య సేవలు అనుక్షణం అందుబాటులో ఉంచాలని సీఎం మోహన్‌చరణ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అతిసార జాడ లేని ప్రాంతాలు సైతం అన్ని ప్రాంతాల్లో నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. దసరా వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో గొట్టపు బావులు, విద్యాసంస్థల్లో తాగునీటిని శుద్ధి, పరీక్షించడంపై ఉద్ఘాటించారు. పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యానికి గురవ్వకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అన్ని విద్యాసంస్థలకు ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ఆరోగ్య మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్, ముఖ్య కార్యదర్శి మనోజ్ అహుజా, ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎస్.అశ్వధి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు



మల్కన్‌గిరి: తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



కొరాపుట్: విక్రమ్ దేవ్ వర్సిటీ ఎదుట హోటల్ వద్ద యజమానులతో అధికారుల వాదనలు



కొరాపుట్: కిచెన్‌లో వంటలు చేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఉన్న పలు హోటళ్లలో జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగం, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు శుక్రవారం చేపట్టారు. ప్రస్తుతం హైజా మహమ్మారి వ్యాప్తిని దృష్టిలో పెట్టుకొని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై దృష్టి సారించారు. వివిధ షాపుల్లో వాడుతున్న నీటి నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. ఏవైనా షాపులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొరాపుట్: జయపూర్‌లోని హోటళ్లపై అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. కిచెన్, ఆహార నిల్వ కౌంటర్ల వద్ద పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో భారీ జరిమానాలు విధించారు. రాష్ట్రంలో డయేరియా విజృంభిస్తుండడంతో హోటళ్లపై విస్తృతంగా దాడులు చేపడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించనందున 5 హోటళ్లపై జరిమానాలు విధించారు. ఈ దాడులు ఇంకా కొనసాగుతాయని అధికారులు ప్రకటించారు.



కొరాపుట్: ఎంజీ రోడ్డులోని హోటల్‌పై దాడులు

క్లుప్తంగా

శభాష్ సాత్విక్



చెస్ ఛాంపియన్ షిప్ టైటిల్ సాధించిన సాత్విక్ స్వంయి

భువనేశ్వర్: జాతీయ ఓపెన్ చెస్ ఛాంపియన్ షిప్ టైటిల్ సాధించిన తొమ్మిదేళ్ల సాత్విక్ స్వంయిను రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి శనివారం అభినందించారు. ఇంత చిన్న వయస్సులో అతని కృషి, పదునైన తెలివి తేటలు మరియు మానసిక స్థిరత్వం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. నిరంతర ప్రోత్సాహం మరియు నిరంతర మద్దతుతో సాత్విక్ విజయానికి మార్గం సుగమం చేసిన అతని తల్లిదండ్రులు మరియు కోచ్‌లకు ముఖ్యమంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

మాజీ సీఎం నవీన్ కోసం పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి తదితరులు

పర్లాకిమిడి: రాష్ట్ర విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శస్త్ర చికిత్స కోసం నిన్న ముంబై వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో తమ ప్రియతమ నేత నవీన్ పట్నాయక్ ఆయురారోగ్యాలతో తిరిగి రాష్ట్రానికి తిరిగిరావాలని కోరుతూ పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా బీజేడీ అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పురపాలక చైర్‌పర్సన్ నిర్మల శెఠి తదితరులు స్థానిక జగన్నాథ స్వామి, గ్రామదేవత నీలమణి అమ్మవారికి శనివారం పూజలు చేశారు. అలాగే స్థానిక బాప్టిస్టు చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

ఓంఫెడ్ పాల ధరలు పెంపు



ఓంఫెడ్ పాల ప్యాకెట్లు

భువనేశ్వర్: ఒడిశా రాష్ట్ర సహకార పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (ఓంఫెడ్) పాల ధరలను పెంచింది. ఈ పెంపు శనివారం నుంచి అమలులోకి వచ్చినట్లు ప్రకటించింది. ఒక లీటరు పాల ధర రూ.2ల నుంచి రూ.4లు వరకు పెరిగింది. మునుపటి ధర కంటే రూ.2లు పెంచడంతో టోన్డ్ పాలు ఇప్పుడు లీటరుకు రూ.50లు, ప్రీమియం పాలు లీటరుకు రూ.54లు అవుతుంది. రూ.4 పెరుగుదలతో గోల్డ్ ప్రీమియం పాలు లీటరుకు రూ.56లు, గోల్డ్ ప్రీమియం+ పాలు ఇప్పుడు లీటరుకు రూ.60లకి లభిస్తాయి.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొందూరు: పొందూరు రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఉదయం ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు హెచ్‌సీ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. మృతుడు తెలుపు, నలుపు గీతల షర్టు, నల్లని నిక్కరు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. వివరాలకు 9110305494 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య



నూకరాజు మృతదేహం

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు సూదికొండ ప్రాంతంలో సూర్యకాలనీకి చెందిన కొవిరి నూకరాజు (22) అనే యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడి కార్మికుడు నారాయణరావు రెండో కుమారుడు నూకరాజు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా, పశ్చిమ బెంగాల్..

బంధాలు బలమైనవి



మాట్లాడుతున్న గవర్నర్ హరిబాబు కంభంపాటి



ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శనలు

భువనేశ్వర్: తరతరాలుగా ఒడిశా మరియు పశ్చిమ బెంగాల్ సాంస్కృతిక, భాషా మరియు సాంప్రదాయ బంధాలు అత్యంత బలమైనవని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. స్థానిక రాజ్ భవన్ నూతన అభిషేక్ హాల్‌లో శనివారం జరిగిన పశ్చిమ బెంగాల్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలో పాల్గొన్న ఆయన ఈ విషయం తెలిపారు. ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్ చొరవలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పురాతన నాగరికత నుంచి ఆధునిక డిజిటల్ యుగం వరకు భారతదేశం పరివర్తన, పురోగతికి కేంద్రంగా పశ్చిమ బెంగాల్‌ను గవర్నర్ అభివర్ణించారు. ఈ రాష్ట్రానికి చెందిన సాధువు శ్రీచైతన్య, రాజా రామ్మోహన్‌రాయ్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, స్వామి వివేకానంద, నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్, మదర్ థెరెస్సా వంటి వారు దేశానికి మార్గదర్శకులుగా నిలిచారన్నారు. ఒడిశాలో నివసిస్తున్న బెంగాలీ సమాజాన్ని ఆయన ప్రశంసించారు. చాలా మంది రాష్ట్రాన్ని తమ రెండో నివాసంగా మార్చుకున్నారన్నారు. ఐక్యత మరియు పరస్పర అవగాహనను పెంపొందించడానికి పశ్చిమ బెంగాల్ రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవాలను జరుపుకున్నట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్ స్థానికులు ఒడిశాలో నివసించిన వారి అనుభవాలను ఈ కార్యక్రమంలో పంచుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



తుది మెరుగులు చెక్కుతున్న బలరాముని రథం

• రథయాత్ర కోసం ముమ్మర ఏర్పాట్లు

పర్లాకిమిడి: రథయాత్ర కోసం స్థానిక జగన్నాథ స్వామివారి మందిరం వద్ద తయారవుతున్న జగన్నాథ, సుభద్ర, బలరాముని రథాల పనులు శరవేగంతో జరుగుతున్నాయి. వాటిలో బలరాముని రథం పూర్తయ్యింది. రథానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈనెల 27న రథయాత్రకు సన్నాహాలు జోరుగా సాగుతున్నట్లు రథయాత్ర కమిటీ సభ్యులు తెలియజేశారు.



గుభాళింపు

పవిత్ర యోగిని ఏకాదశిని శ్రీక్షేత్రంలో ఖొల్లి లగ్గి ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా బలభద్రుడు, దేవీ సుభద్ర, జగన్నాథుడు మరియు సుదర్శన మూల విరాటులకు శనివారం గంధం పూశారు. జ్యేష్ఠ పూర్ణిమ నుంచి దేవుళ్లు అస్వస్థతకు గురై తెరచాటున గోప్య ఉపచారాలతో క్రమంగా కోలుకున్నారు. ఖొల్లి లగ్గి ఏకాదశి నాడు జగన్నాథుడు సోదర సోదరి సమేతంగా పూర్తిగా స్వస్థత పొందడంతో చందన లేపనం చేసి తులసీ దళాలు ఇతరేతర సుగంధిత పుష్పాలతో పూజించారు. ఆరోగ్యం మరింత త్వరగా కోలుకోవాలని దశమూల మోదకాలు నివేదించారు.

– భువనేశ్వర్

రథయాత్ర ఏర్పాట్లపై క్షేత్రస్థాయి సమీక్ష



ఉన్నతాధికారులతో కలిసి పర్యటిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మలు



కొరాపుట్‌లో నిర్మితమవుతున్న రథాలు

కొరాపుట్: దక్షిణ ఒడిశా పూరీగా పిలవబడుతున్న కొరాపుట్ జిల్లా కేంద్రంలోని శబరి శ్రీక్షేత్రంలో జరిగే రథయాత్ర ఏర్పాట్లపై కలెక్టర్ క్షేత్రస్థాయి సమీక్ష జరిపారు. శనివారం కలెక్టర్ వి.కీర్తివాసన్, ఎస్పీ రోహిత్ వర్మలు రథాలు వద్దకు వెళ్లారు. ఈనెల 27వ తేదీన జరిగే రథయాత్రలో ఎటువంటి అసౌకర్యాలు ఉండకూడదని ఆదేశించారు. వర్షం పడితే మురుగు కాలువల్లో నీరు రోడ్డు మీదకు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ వైర్ల మళ్లింపు, అత్యవసర వైద్య సదుపాయాలు ఉండాలన్నారు. శబరి శ్రీక్షేత్రం నుంచి గుండిచా మందిరం వరకు మూడు రథాలు క్షేమంగా చేరేందుకు మార్గాలు సుమగంగా ఉండాలని ఆదేశించారు. వారితో పాటు మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి ఉన్నారు.



ఒణొసారొ పాణకం

జ్వరం, ఒళ్లు నొప్పులకు గోప్య ఉపచారాలు పొంది మెల్లగా కోలుకుంటున్న పూరీ జగన్నాథ స్వామివారికి ఔషధ మూలికలతో ఘాటైన కషాయం వంటి పత్యపు నైవేద్యాల నుంచి ఉపశమనం కల్పిస్తున్నారు. పాలతో రుచికరంగా తయారు చేసిన ఒణొసారొ పాణకం శనివారం సమర్పించడం ప్రారంభించారు.

– భువనేశ్వర్/పూరీ

అంబేడ్కర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ రాష్ట్ర చైర్మన్, సీనియర్ అడ్వకేట్ పినిపే వెంకట రామకృష్ణ అన్నారు. నగరంలోని ఇలిసిపురం అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ క్యాడర్ క్యాంపు శనివారం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 158 బార్ కౌన్సిల్‌లు ఉన్నాయని, వాటిలో ఏఏఎఫ్ క్యాడర్ కూడా ఉందన్నారు.

ఎనిమిది వేల మంది ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులున్నారని, మనమంతా ఐక్యతను చాటి చెప్పాలన్నారు. ఏఏఎఫ్ అనేది నిరంతర ప్రక్రియ అని, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని స్పష్టం చేశారు. అంబేడ్కర్ మూమెంట్ నడపాలంటే కఠోర దీక్ష ఉండాలని, నాయకునికి ఎటువంటి బలహీనతలు ఉండకూడదని చెప్పారు. రాజకీయ పార్టీలు ఎస్సీ, ఎస్టీలను విభజించి పాలిస్తున్నాయన్నారు. ఈసారి రాష్ట్ర బార్ కౌన్సిల్ పోటీల్లో ముగ్గురు న్యాయవాదులు తప్పనిసరిగా గెలవాల్సిన అవసరం ఉందన్నారు. మనకు ఎవ్వరూ ఎటువంటి పదవులు ఇవ్వరని, పోరాటాల ద్వారానే సాధించుకోవాలని పిలుపునిచ్చారు. బతికినంత కాలం అంబేడ్కర్ విధానంతో బతకాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పొన్నాడ రాము, బి.మురళీకృష్ణ, రుంకు అప్పారావు, గంజి ఆర్.ఎజ్రా, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, అడ్వకేట్ దండాసి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే సంప్రదాయ వస్త్రధారణ అమలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈఓ కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్ ఆదేశాల మేరకు సంప్రదాయ వస్త్రధారణ నిబంధనలు ఆదివారం నుంచే అమల్లోకి రానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం జరిగే సూర్యనమస్కార పూజల్లో పురుషులు కచ్చితంగా పంచె, చొక్కా, మహిళలు చీర చూడీదార్‌ను మాత్రమే ధరించి పూజల్లో కూర్చునేలా చర్యలు చేపట్టనున్నారు. ఎలాంటి ఫ్యాషన్ దుస్తులతో దర్శనాలకు అనుమతించకుండా ఈవో ప్రసాద్ ఇప్పటికే సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించినట్లుగా తెలిసింది. నేటి నుంచి అంతరాలయ దర్శనాలను సాయంత్రం 6 గంటల వరకు పొడిగింపు నిర్ణయాన్ని కూడా అమలు చేయనున్నారు..దీంతో భక్తులకు మరింత సౌకర్యవంతంగా అంతరాలయ దర్శనానికి వీలవుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.


నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ అధికారులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన ప్రగడ రామ్‌నాయుడు, గజలక్ష్మి దంపతులు, వారి కుమారుడు బాలాదిత్య రూ.1,00,001 విరాళంగా సమర్పించారు. ఈమేరకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణకు శనివారం విరాళం అందజేశారు. అంతకుముందు ఆదిత్యున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ బాలభాస్కర్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ అనుమానాస్పద మృతి



పి.జగన్నాథం(ఫైల్)

ఎచ్చెర్ల : లావేరు మండలం అదపాక సమీపంలోని పంట పొలాల్లో విశాఖపట్నం జిల్లా తాటిచెట్లపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.జగన్నాథం(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అదపాక వీఆర్‌వో ఎస్.వెంకటరమణ ఫిర్యాదు మేరకు లావేరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. లావేరు హెచ్‌సీ జోగారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలపై ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతులు



సబ్ కలెక్టర్ కార్యాలయానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొరాపుట్: తమ ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరుగుతున్నాయని కోట్‌పాడ్ సమితి బబయా పంచాయతీకి చెందిన రైతులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం జయపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తమ ప్రాంతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు (మండీ) ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం ఈ మండీలో 46 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నా, ఇప్పటివరకు కేవలం 24 వేల క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. మిగతా 20 వేల క్వింటాళ్ల ధాన్యం మండీల్లో పడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని కొనుగోలు చేయాల్సిన అధికారులు మండీలకు రాకుండా ముఖం చాటేస్తున్నారని వాపోయారు. మరో 10 రోజుల్లో మండీలు ముగుస్తాయని వాపోయారు. అసలు బబయా మండికి అధికారులు ఎందుకు రావడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఈనెల 24వ తేదీలోపు తమ ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. లేకపోతే అదేరోజు జయపూర్ ట్రాఫిక్ జంక్షన్ వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.


జంట నగరాల్లో విద్యుత్ బస్సు సేవలు



డిపోలో రవాణాకు సిద్ధమైన 100 విద్యుత్ బస్సులు

భువనేశ్వర్: క్యాపిటల్ రీజియన్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ (క్రట్) ఆధ్వర్యంలో 100 విద్యుత్ బస్సులను శనివారం ప్రారంభించారు. ఈ బస్సులు మో బస్సు కార్యక్రమం కింద పూరీ, భువనేశ్వర్, కటక్ ప్రాంతాల్లో 8 కొత్త రూట్లలో రాకపోకలు చేస్తాయి. కొత్తగా ప్రారంభించిన నరాజ్ విద్యుత్ బస్ డిపో 100 కొత్త విద్యుత్ బస్సులు నడుస్తాయి. పూర్తిగా హరిత భవనం సాంకేతికతో నరాజ్ బస్ డిపో నిర్మితం కావడం విశేషం.

• బహుళ జాతి పండ్ల నైవేద్యం



ఆషాఢ కృష్ణ పక్ష ఏకాదశి పురస్కరించుకుని పూరీ సమీపం బ్రహ్మగిరి ప్రాంతంలోని అలార్ నాథ స్వామి దేవస్థానం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ తిథి పురస్కరించుకుని స్వామివారు చందన లేపనంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్నాడు. ఈ సందర్భంగా బహుళ జాతి పండ్లను స్వామి వారికి భారీ నైవేద్యంగా శనివారం సమర్పించారు.

– భువనేశ్వర్

ప్రయాణికుల కస్సు‘బస్సు’



మధ్యాహ్నం ఇలా: బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

- ఉదయం పూట బస్సులు ఉన్నా కానరాని ప్రయాణికులు
- మధ్యాహ్నం పూట ప్రయాణికులు ఉన్నా లేని బస్సులు
- ఆర్టీసీ అధికారుల తీరుపై మండిపాటు



ఉదయం ఇలా: బస్సులు ఉన్నా ప్రయాణికులు లేకబోసిపోయిన నాన్‌స్టాప్ కౌంటర్

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం విశాఖపట్నంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి జనాలను తరలించేందుకు జిల్లా నుంచి 220 బస్సులు వేసిన సంగతి తెలిసిందే. దీంతో చాలా రూట్లలో బస్సులు తిరగకపోవడంతో ముఖ్య ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంత ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వింత పరిస్థితి నెలకొంది. శనివారం ఉదయం నుంచి దూరప్రాంతాలకు వెళ్లేందుకు కాంప్లెక్స్‌లో బస్సులు ఉన్నప్పటికీ ప్రయాణికులు ఎవరూ కనిపించలేదు. ముఖ్యంగా విశాఖ వెళ్లే నాన్‌స్టాప్ కౌంటర్ ఖాళీగా కనిపించింది. మధ్యాహ్నం 12గంటల వరకూ బోసిపోయి కనిపించింది. ప్రయాణికులు రాక ఆ బస్సులు అలాగే ఉండిపోయాయి. ఇక ఇచ్ఛాపురం, పాతపట్నం, బత్తిలి, రాజాం, బొబ్బిలి, విజయనగరం, పాలకొండ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు కూడా అంతంత మాత్రంగానే ఉండటం కనిపించింది.

తప్పని పడిగాపులు..

శనివారం మధ్యాహ్నం సమయంలో ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండటం కనిపించింది. యోగాంధ్ర కార్యక్రమం పూర్తయి బస్సులు వచ్చేస్తాయని భావించి అనేక మంది ప్రయాణికులు రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకూ అధిక సంఖ్యలో ప్రయాణికులు కాంప్లెక్స్‌కు చేరుకున్నా బస్సులు లేక గంటల తరబడి నిరీక్షించారు. మారుమూల గ్రామాలకు వెళ్లేందుకు సైతం బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది.

ముందస్తు సమాచారం లేక..

విశాఖపట్టణంలో జరిగిన యోగాంధ్రకు ఆర్టీసీ బస్సులను తరలించిన నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు తిరగవని అధికారులు ముందస్తు సమాచారం చేరవేస్తే బాగుండేదని, తమ ప్రయాణాలను వాయిదా వేసుకునేవారమని పలువురు ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి లాసెట్‌లో ర్యాంకు


మరిచెర్ల గంగారావు

వంగర: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మరిచెర్ల గంగారావు లాసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించారు. ఇటీవల ఆంధ్రా యూనివర్సిటీ లాసెట్ ఫలితాలు విడుదల కాగా గంగారావు 94 మార్కులు సాధించి 825 ర్యాంకు సాధించారు. లా విద్య పూర్తి చేయాలని ఉద్యోగ విరమణ తరువాత లాసెట్ రాశానని గంగారావు తెలిపారు.

న్యాయం కోసం వినతి


ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

విజయనగరం అర్బన్: పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం తాలాడ గ్రామానికి చెందిన గొర్లె భారతి తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావుకు వినతిపత్రం అందించారు. శనివారం ఆయన్ని కలిసి సమస్యలను చెప్పుకున్నారు. తన భర్త గొర్లె భీముడు అనుమానాస్పద మృతికి సంబంధించి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశానని పేర్కొంది. తనకు తగిన న్యాయం జరిగేలా చూడాలని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన సహకారం అందిస్తానని చైర్మన్ డాక్టర్ శంకరావు హామీ ఇచ్చారు. చైర్మన్‌ని కలిసిన వారిలో ఏపీ ఏకలవ్య సేవా సంఘం అధ్యక్షుడు గేదెల రమణమూర్తి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

బైక్ - ఆటో ఢీ

- ముగ్గురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం కొండలేవిడి సమీపంలో శనివారం సాయంత్రం ఆటో, బైక్ ఢీన్నాయి. కురుపాం మండలం పులిపుట్టి గ్రామానికి చెందిన మండంగి వేణు, అనిల్, సునీత బైక్‌పై గుమ్మలక్ష్మీపురం నుంచి బ్యాంక్ పని చూసుకొని పులిపుట్టి వెళ్తుండగా.. కొండలేవిడి సమీపంలో అటుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణించిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను భద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో వేణు పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

సామాన్యులకు విద్యుత్ బిల్లుల షాక్..!


బిల్లును చూపిస్తున్న రామకృష్ణ

బొబ్బిలి రూరల్: రెక్కాడితే కాని డొక్కాడని సామాన్య, పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లుల బాదుడుతో షాక్ ఇస్తోంది. మండలంలోని రంగరాయపురం గ్రామానికి చెందిన బండారు రామకృష్ణ కూలి పనుల చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈయనకి చిన్న సొంత ఇల్లు ఉంది. ఒక బల్బు, ఒక ఫ్యాన్ వినియోగిస్తుంటారు. గతంలో విద్యుత్ బిల్లు నెలకు రూ.300 లోపలే వచ్చేది. మే నెలకు సంబంధించి ఆయనకు రూ.997 బిల్లు వచ్చింది. బిల్లును చూసి సదరు కుటుంబ సభ్యులు మూర్ఛపోయినంత పని అయ్యింది. కూలి పనులు చేసుకునే తాము ఇంతేసి బిల్లులు ఎలా చెల్లించగలమని, గతంలో ఎప్పుడూ ఇంత బిల్లు రాలేదని వాపోతున్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన చిన్నారావు

జియ్యమ్మవలస/జియ్యమ్మవలస రూరల్: మండలంలోని టీకే జమ్ము గ్రామానికి చెందిన బెలగాపు చిన్నారావు (58) తమ గ్రామ సమీపంలో ఆటో ఢీకొని శనివారం మృతి చెందారు. జియ్యమ్మవలస ఎస్సై ఎన్.ప్రశాంత్‌కుమార్ తెలిపిన వివరాలు.. టీకేజమ్ము గ్రామానికి చెందిన చిన్నారావు రెండు రోజులుగా జ్వరంతో బాధ పడుతూ శనివారం రావాడ రామభద్రపురం ఆసుపత్రికి వెళ్లడానికి ఇంటి నుంచి టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా రావాడ రామభద్రపురం పీహెచ్‌సీకి వేరే ఆటోలో తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మరణించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డేంజర్ బెల్స్..!

- యువతలో పెరుగుతున్న హెచ్‌ఐవీ..!
- 2024 - 25లో 371 కేసులు నమోదు
- 25 నుంచి 35 ఏళ్లలోపు హెచ్‌ఐవీ సోకిన వారు 70 మంది
- 25 నుంచి 49 ఏళ్లలోపు హెచ్‌ఐవీ బారినపడ్డ వారు 171 మంది
- 15 ఏళ్ల నుంచి 24 ఏళ్లలోపు హెచ్‌ఐవీ సోకిన వారు 30 మంది

వయసుల వారీగా హెచ్‌ఐవీ రోగుల వివరాలు...

వయసు	పురుషులు	మహిళలు
0 నుంచి 14	03	01
15 నుంచి 24	24	06
25 నుంచి 34	50	20
35 నుంచి 49	86	85
49 పైబడిన వారు	51	45


ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఐసీటీసీలో హెచ్‌ఐవీ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి పెరుగుతుంది. హెచ్‌ఐవీపై అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యం కారణంగా కొంతమంది హెచ్‌ఐవీ బారిన పడుతున్నారు. వీరిలో యువత అధికంగా ఉండడం ఆందోళన కల్గిస్తున్న అంశం. తక్కువ వయసులోనే హెచ్‌ఐవీ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తక్కువ వయసులో హెచ్‌ఐవీ బారిన పడడం వల్ల యువకులకు వివాహాలు కూడా కావడం లేదు. వివాహం అయిన తర్వాత కొంతమందికి హెచ్‌ఐవీ మహామ్మారి వ్యాప్తి చెందడంతో వారి జీవితాలు అంధకారం అవుతున్నాయి. ఇది ప్రాణాంతకమైన వ్యాధి కావడంతో సోకితే జీవితాంతం మందులు వాడాల్సిందే. నిరాక్షరాస్యులతో పాటు, విద్యావంతులు కూడా హెచ్‌ఐవీ బారిన పడుతున్నారు. హెచ్‌ఐవీ సోకిన వారికి రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. దీని వల్ల క్షయ, ఇన్‌ఫెక్షన్‌లు సోకే అవకాశం ఉంది. తగు జాగ్రత్తలు పాటించకపోతే త్వరగా మరణించే అవకాశం ఉంది.

2024 - 25లో 371 కేసుల నమోదు

2024 – 25 సంవత్సరంలో 371 హెచ్‌ఐవీ కేసులు నమోదయ్యాయి. ఇందులో పురుషులే అధికంగా హెచ్‌ఐవీ బారిన పడ్డారు. ఇందులో 214 మంది పురుషలు కాగా మహిళలు 157 మంది ఉన్నారు. వీరిలో 25 నుంచి 35 ఏళ్లలోపు హెచ్‌ఐవీ బారిన పడ్డవారు 70 మంది ఉన్నారు. 35నుంచి 49 ఏళ్లలోపు వారు 171 మంది ఉన్నారు. 15 నుంచి 24 ఏళ్లలోపు హెచ్‌ఐవీ బారిన పడిన వారు 30 మంది ఉన్నారు. 49 ఏళ్ల పైబడిన వారు 96 మంది ఉన్నారు. 14 ఏళ్లలోపు వారు నలుగురు ఉన్నారు.

ఐసీటీసీ కేంద్రాల్లో హెచ్‌ఐవీ పరీక్షలు

జిల్లాలో సమగ్ర సలహా పరీక్ష కేంద్రాలు (ఐసీటీసీ) 14 ఉన్నాయి. ఫెసిలిటి ఇంటిగ్రేటెడ్ ఐసీటీసీలు(పీహెచ్‌సీల్లో) 66 ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐసీటీసీలు 20 ఉన్నాయి. వీటిల్లో హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తారు. ఇక్కడ హెచ్‌ఐవీ నిర్ధారణ అయిన వారిని ఏఆర్‌టీ కేంద్రానికి పంపిస్తారు.

ఏఆర్‌టీ కేంద్రంలో రిజిస్టర్ అయిన రోగులు 8125

ఐసీటీసీ సెంటర్‌లో హెచ్‌ఐవీ పరీక్ష చేసినప్పుడు అక్కడ హెచ్‌ఐవీ నిర్ధారణ అయిన వారికి చికిత్స కోసం ఏఆర్‌టీ కేంద్రానికి పంపిస్తారు. అక్కడ హెచ్‌ఐవీ రోగి వివరాలు నమోదు చేస్తారు. తర్వాత రోగ నిరోధక శక్తి (సిడిఫోర్) కౌంట్ పరీక్ష చేస్తారు. దాని అధారంగా మందులు అందిస్తారు. హెచ్‌ఐవీ సోకిన గర్భిణులకు కూడా పుట్టే బిడ్డకు హెచ్‌ఐవీ సోకకుండా మందులు అందిస్తారు. ఏఆర్‌టీ కేంద్రంలో రిజిస్టర్ అయిన రోగులు 8,125 మంది ఉన్నారు. వీరిలో పురుషలు 3,382 మంది, మహిళలు 4,412 మంది, పిల్లలు 315 మంది ఉన్నారు.


హెచ్‌ఐవీపై కౌన్సెలింగ్ చేస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్

పరీక్షలు నిర్వహిస్తున్నాం..

హెచ్‌ఐవీ వ్యాప్తిని అరికట్టడం కోసం వీలైనంత ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. హెచ్‌ఐవీని త్వరగా గుర్తించడం వల్ల వ్యాప్తిని తగ్గించడానికి అవకాశం ఉంటుంది. హెచ్‌ఐవీపై అవగాహన కల్పించి వారి అంగీకారం మేరకు పరీక్షలు చేస్తారు. కళాజాతల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. – డాక్టర్ రాణి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


ఎస్పీ కార్యాలయంలో సూర్యనమస్కారాలు చేస్తున్న పోలీసు శాఖాధికారులు

- ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: యోగాతో మానసిక, శారీరక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందొచ్చని ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి అన్నారు. ఎస్పీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ కార్యాలయ పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసుస్టేషన్లలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు సింహాచలాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ థామస్ రెడ్డి మాట్లాడుతూ ఒత్తిడి నుంచి విముక్తి, ఆత్మ నియంత్రణ, మెరుగైన రక్త ప్రసరణ వంటి ఫలితాలను యోగా ఆసనాలు వేసి పొందవచ్చన్నారు. ఎస్‌బీ సీఐ రంగనాథం, ఏఆర్ ఆర్ఐ నాయుడు, సీఐ సుధాకర్, ఏవో జి.సతీష్‌బాబు, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి కేరళలో ఎస్ఎఫ్ఐ మహాసభలు



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 18వ అఖిల భారత మహాసభల పోస్టర్‌ను స్థానిక ఎల్బీజీ భవన్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వం ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లాడుతూ... ఈ నెల 27 నుంచి 30 వరకు కేరళలోని కొజికోడ్‌లో అఖిల భారత మహాసభలు జరగబోతున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతిని నెలకొల్పాలని కోరుతున్న ఎస్ఎఫ్ఐ ఈ ప్రాంగణానికి పాలస్తీనా నగర్ అని పేరును పెట్టి పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దురాగతాన్ని చాటి చెబుతుందని తెలిపారు. మహాసభలలో విద్యారంగ సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చలు జరుగుతాయని, దానిలో భాగంగా నూతన విద్యా విధానం 2020 ద్వారా వచ్చే విపత్తులపై చర్చలు జరుపుతాయని పేర్కొన్నారు. కొత్తగా తెస్తున్న జీవోలు విద్యావిధానాన్ని వెనక్కు నెట్టేలా ఉన్నాయని, దానిలో భాగంగా పాఠశాలలు మూసివేసే జీవో నెం.19, 20, 21లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని వెనుకకు నెట్టేలా, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా విధానానికి ముందుకు తీసుకువెళ్లేలా ఈ ప్రభుత్వాల తీరు కనిపిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నబాబు, రవికుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం భారీ స్కోర్

- సచిన్ సెంచరీ


సెంచరీ సాధించిన శ్రీరామ్ సచిన్

విజయనగరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక విజ్జి క్రికెట్ మైదానంలో శనివారం నుంచి ప్రారంభమైన అంతర్ జిల్లాల మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో విజయనగరం భారీ స్కోర్ సాధించింది. విజయనగరం జట్టు మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రీరామ్ సచిన్ అద్భుతంగా ఆడి 80 బంతుల్లో 152 పరుగులు సాధించడంతో తొలి రోజే విజయనగరం 411 పరుగుల భారీ స్కోర్ సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విజయనగరం జట్టు తొలి రోజు 83.5 ఓవర్లలో 411 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. టాప్ ఆర్డర్ బ్యాటర్ లోహిత్ రెడ్డి (91 పరుగులు), కార్తికేయ (63 పరుగులు) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆట ముగిసే సమయానికి శ్రీకాకుళం జట్టు నాలుగు ఓవర్లు వికెట్ నష్టపోకుండా ఐదు పరుగులు సాధించింది. వేగంగా ఆడి సెంచరీ సాధించిన శ్రీరామ్ సచిన్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు ట్రెజరర్ పీఎస్ఎన్ వర్మ, సెలెక్టర్ సర్పరాజ్ అభినందించారు.

పకడ్బందీగా పోలీసు బందోబస్తు


విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంలో ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ శనివారం అభినందించారు. యోగాంధ్ర నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చేపట్టిన బందోబస్తు, భద్రత విధులను అధికారులు, సిబ్బంది అంకితభావంతో నిర్వహించారన్నారు. విశాఖ ఐటీ సెజ్ నుంచి కాపులుప్పాడ వరకు ఏర్పాటు చేసిన 59 కంపార్ట్‌మెంట్లలో ప్రజలు చేరుకునే విధంగా ఇతర శాఖల అధికారులతో పోలీసు సిబ్బంది సమన్వయంతో పని చేశారన్నారు. కార్యక్రమం అనంతరం ట్రాఫిక్‌కు ఎటువంటి అవాంతరాలు ఎదురవ్వకుండా సమర్ధవంతంగా పోలీసు అధికారులు, సిబ్బంది పని చేశారని కొనియాడారు. వీవీపీల భద్రత దృష్ట్యా జిల్లా మీదుగా విశాఖపట్నం వెళ్లే కొత్తవలస మండలం చింతలపాలెం, డెంకాడ మండలం రాజాపులోవ వద్ద ఏర్పాటు చేసిన రెండు చెక్ పోస్టులు సత్ఫలితాలు ఇచ్చాయని ఎస్పీ పేర్కొన్నారు.

యోగాంధ్రలో ఆకలి కేకలు

- 15 వేల మంది విద్యార్థులకు భోజనం కరువు
- విజయనగరానికి మధ్యాహ్నం ఒంటి గంటకు, మన్యం జిల్లాకు 3 గంటలకు చేరిన బస్సులు
- అప్పటివరకు ఆకలితో అలమటించిన విద్యార్థులు


పస్తులతో గిరిజన విద్యార్థులు

విజయనగరం అర్బన్/ విజయనగరం గంటస్తంభం: విశాఖలో యోగా డేకు వెళ్లిన విద్యార్థులు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి దాపురించింది. సమయానికి తిండిలేక అవస్థలు పడ్డారు. తిరుగు ప్రయాణంలో జిల్లా సరిహద్దులో వడ్డించిన జావ మాదిరిగా ఉన్న ఉప్మాను తినలేక పారబోశారు. యోగాంధ్ర పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంపై ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఇదీ పరిస్థితి...

యోగాపై ప్రజల్లో అవగాహన పెంచాలని నెలరోజుల పాటు ఉద్యోగులను విధులకు దూరం చేసి కోట్లాది రూపాయలు వెచ్చించించి చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం జిల్లా విద్యార్థులను అవస్థలకు గురిచేసింది. విజయనగరం జిల్లా నుంచి విశాఖకు వెళ్లే 15 వేల మంది విద్యార్థులకు ఆయా కళాశాలలు, హాస్టల్స్ నుంచి 140 బస్సులు ఏర్పాటు చేశారు. ముందురోజు సాయంత్రానికే సిద్ధంచేసిన బస్సులను తెల్లవారి జామున 3 గంటలకే బయలుదేరి విద్యార్థులను విశాఖకు తీసుకెళ్లారు. జిల్లాకు కేటాయించిన భీమిలి బీచ్‌కు చేరే సరికి సంబంధిత పార్కింగ్ స్థలంలో పార్కింగ్ సమస్యతో పాటు కంపార్ట్‌మెంట్‌లో ఇవ్వాల్సిన స్నాక్స్, మ్యాట్‌లు అందలేదని విద్యార్థులు వాపోయారు. మ్యాట్‌లు, టీ షర్ట్‌లు లేకుండా, అల్పాహారం లేకుండానే యోగాడే పాల్గొన్నామని తెలిపారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ జిల్లా ప్రవేశాల సరిహద్దులైన భోగాపురం, కొత్తవలస, జొన్నాడ రహదారులలో సంబంధిత బస్సులను ఆపించి టిఫిన్, తాగునీరు వంటివి అందించారు. అప్పటికే తిరుగు ప్రయాణం చేసిన పార్వతీపురం మన్యం జిల్లా బస్సుల్లోని యోగా సాధకులకు అల్పాహారం కూడా అందలేదు. వారంతా జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లను ఆశ్రయించారు. తిరుగు ప్రయాణంలో జిల్లా కేంద్రానికి చేరే సరికి ఒంటి గంట, పార్వతీపురం చేరేసరికి మధ్యాహ్నం 3 గంటలు అయ్యింది. తొలుత స్నాక్స్ పంపిణీని బస్సులు బయలుదేరే సమయంలోనే ఇవ్వాలని జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించింది. విశాఖలో స్నాక్స్ ఇస్తున్నామని, జిల్లా కేంద్రంలో ఆ ఖర్చు అవసరం లేదని ఒకరోజు ముందు ఓ మంత్రి జిల్లా కేంద్రానికి ఆదేశాలిచ్చారట. దీంతో తొలిరోజు స్నాక్స్ పంపిణీ ఆపేశామని, ఇబ్బందులు ఎదురయ్యాయని అధికార వర్గాల్లో చర్చసాగుతోంది.

కోర్టు భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయండి

- హైకోర్టు న్యాయమూర్తిని కలిసి విన్నవించిన ఎస్.కోట న్యాయవాదులు


హైకోర్టు న్యాయమూర్తి రవిని కలిసిన ఎస్.కోట న్యాయవాదులు

శృంగవరపుకోట : శృంగవరపుకోటలో శిథిలమైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాల నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేయించాలని ఎస్.కోట న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తి, విజయనగరం ప్రోటోకాల్ జడ్జి చీమలపాటి రవికి శనివారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి రవి మాట్లాడుతూ ఎస్.కోట కోర్టు భవనాల కోసం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ద్వారా ఆర్అండ్‌బీ పంపిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు విడుదల చేయించేందుకు ప్రయత్నాలు జరుపుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసుల సంఖ్య, కోర్టులకు అవసరమైన జడ్జీల ఖాళీలను దృష్టిలో పెట్టుకుని కొత్తగా జూనియర్ సివిల్ జడ్జీల నియామకాలు చేపట్టేందుకు కూడా ప్రభుత్వం దృష్టికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తీసుకెళ్లారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో అవసరమైన ఏసీలు, ఫర్నీచర్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర హైకోర్టు కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమై చర్చిస్తున్న విషయాన్ని కూడా వివరించారు. హైకోర్టు న్యాయమూర్తి రవిని కలిసిన వారిలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బీవీఎస్ రామారావు, ట్రెజరర్ బి.త్రిమూర్తులు, న్యాయవాదులు డబ్ల్యూఎస్. శర్మ, బి.సత్యనారాయణ, బడబళ్ల రామకష్ణ, రావాడ సత్యనారాయణ, బొడ్డు వెంకటరావు ఉన్నారు.

చేతులెత్తేసిన జీసీసీ

- కొండచీపుర్లు కొనుగోలులో..
- లక్ష్యాలు పూర్తవడంతో తప్పించుకుంటున్న అధికారులు
- వీడీవీకేలున్నా ఫలితం సున్నా..
- ఇళ్లల్లోనే మూలుగుతున్న చీపుర్లు


కొండపై పంటను వదిలేసిన రైతులు

సీతంపేట: గిరిజనులు ఆరుగాలం శ్రమించి పండించిన కొండచీపుర్ల పంటను కొనుగోలు చేయడంలో గిరిజన సహకార సంస్థ(జీసీసీ) చేతులెత్తేసింది. లక్ష్యాలకు మించి కొనుగోలు చేశామని, సీజన్ కూడా ముగిసిందని సంబంధిత అధికారులు చెప్పుకొస్తున్నారు. గిరిజనులు మాత్రం తాము పండించే కొండచీపుర్ల పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చేతికొచ్చిన పంటను కోయకుండా కొండలపైనే వదిలేశామని చెబుతున్నారు. పంట మొత్తం కొండపైనే కుల్లుతుందంటున్నారు. ఒకవేళ పంట కోయించినా కనీసం కూలి డబ్బులు కూడా రావని, చివరకు నష్టాలు చవిచూస్తామని వాపోతున్నారు. గతంలో గ్రేడ్ ఉన్న చీపురు రూ.50 వరకు వ్యాపారులకు విక్రయించగా ఇప్పుడు రూ.30లోపే విక్రయిస్తున్నామని గిరిజనులు చెబుతున్నారు. పైగా కొనుగోలుదారులు కూడా పెద్దగా రావడం లేదని వ్యాపారులు వచ్చినా తక్కువ ధరలకు అంతంత మాత్రంగానే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. శనివారం కుశిమి, ఆది, సోమవారాలు సీతంపేట మార్కెట్‌కు, బుధవారం మర్రిపాడు, గురువారం దోనుబాయి వారపు సంతలకు కొండచీపుర్లు తీసుకవచ్చినా వ్యాపారులు మాత్రం గ్రేడ్ వన్ రూ.30, గ్రేడ్ టు 20 వరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. జిల్లాలో అత్యధికంగా సీతంపేట ఏజెన్సీలో దాదాపు 20 వేల ఎకరాల్లో కొండచీపుర్ల పంట పండుతుంది. కొండలపై ఎక్కడ చూసిన ఈ పంట కనిపిస్తుంది. ఒక్కప్పుడు మార్కెట్ ధరలు ఎక్కువగా ఉండడంతో కొండ పోడు వ్యవసాయంలో ఆ పంటనే ఎక్కువగా వేశారు. కొండచీపుర్లు తయారు చేసి అనునిత్యం మార్కెట్‌కు గిరిజనులు తీసుకువస్తున్నారు. శ్రమకు తగ్గ ఫలితం లబించడం లేదని రైతులు వాపోతున్నారు.

కొనుగోలు నిలిపివేసిన జీసీసీ

లక్ష్యాలను మించి కొనుగోలు చేశామని, దీంతో కొండచీపుర్ల కొనుగోలు నిలిపివేశామని, సీజన్ కూడా ముగిసిందని, గిరిజన సహకార సంస్థ అధికారులు చెబుతున్నారు. లక్ష చీపుర్ల కొనుగోలు టార్గెట్ నిర్ణయించగా 2లక్షల 50 వేలు వరకు కొనుగోలు చేసినట్టు సంబంధిత అధికారులు చెబుతున్నారు. జీసీసీ 1వ రకం కొండచీపుర్లు రూ.45, రెండవ రకం రూ.40, మూడో రకం రూ.30 కొనుగోలు మద్దతు ధరలు నిర్ణయించింది. జీసీసీ పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.


రంగంవలసలో కుప్పపెట్టి వదిలేసామంటున్న గిరిజన మహిళ


రేగుమానుగూడలో సేకరించి ఉంచేసిన కొండచీపుర్లు

మరోవైపు వనధన్ వికాస కేంద్రాల (వీడీవీకే)లను ఏర్పాటు చేసి వాటి ద్వారా చీపుర్లు తయారు చేసి మార్కెటింగ్ చేయాలని నిర్ణయించి, సీతంపేట, జక్కరవలసలలో ఏర్పాటు చేసినా ఆ యూనిట్లు సక్రమంగా నడపడం లేదు. జక్కరవలసలో కొండచీపుర్లు తయారు చేయడానికి ఇచ్చిన యూనిట్‌కు సక్రమంగా పని చేయడం లేదని గిరిజనులు తెలిపారు.

సీజన్ ముగిసింది



కొండచీపుర్లను ఈ ఏడాది ఎక్కువగానే కొనుగోలు చేశాం. లక్ష్యాలను మించి సుమారు 2లక్షల 50 వేల వరకు కొనుగోలు చేశాం. ప్రస్తుతం సీజన్ ముగిసింది. గత మూడు నెలల్లో సీజన్ కాలంలో గిరిజనులకు గిట్టుబాటు ధరలు కల్పించి చీపుర్లు కొనుగోలు చేశాం.

– దాసరి కృష్ణ, జీసీసీ మేనేజర్

ఇళ్ల వద్దే..



కొండల్లో వేసిన పంటను కోసి ఇంటికి తీసుకు వచ్చి కొండచీపుర్లుగా తయారు చేసిన కొన్నింటిని మార్కెట్ ధరలు లేక ఇంటివద్దనే ఉంచేశాం. కొన్ని ప్రాంతాల్లో వేసిన పంటను అలానే వదిలేశాం. ఈ ఏడాది కొండచీపుర్లు పంట విషయంలో పూర్తిగా నష్టాలు చవిచూశాం.

– ఎస్.షోదంగ, చింతాడ